# మాజి ప్రిన్సిపల్ నివాసంలో సిబిఐ సోదాలు



కోల్‌కతా : ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ నివాసంలో సిబిఐ ఆదివారం సోదాలు ప్రారంభించింది. ఘోష్ ప్రిన్సిపల్‌గా ఉన్న సమయంలో ఆర్‌జి కర్ ఆస్పత్రిలో ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారని అధికారులు తెలిపారు. సిబిఐకి చెందిన సుమారు ఏడుగురు అధికారులు ఉదయం 8.00 గంటల నుండి బెలియాఘట నివాసంలో ఘోష్‌ని విచారిస్తోంది. కేంద్ర భద్రతా బలగాలతో అధికారులు ఉదయం 6.00 గంటలకు ఘోష్ నివాసానికి చేరుకున్నారు. అయితే సుమారు గంటన్నరపాటు అధికారులు వేచిచూసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరో సిబిఐ అధికారుల బృందం ఆస్పత్రిలోని ఘోష్ కార్యాలయంలో సోదాలు నిర్వహించింది. ఇన్‌స్టిట్యూట్ క్యాంటీన్‌ను కూడా పరిశీలించింది. ఆర్జీకర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అవినీతికి పాల్పడినట్లు గతంలో పనిచేసిన డిప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ ఫిర్యాదు చేశారు. పేషెంట్స్‌కు అవసరమైన సామాగ్రిని సరఫరా చేసేవారి నివాసాలు, కార్యాలయాలపై కూడా సిబిఐకి చెందిన అవినీతి నిరోధక విభాగం దాడులు చేస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మాజీ మెడికల్ సూపరింటెండెంట్, ఆస్పత్రి వైస్ ప్రిన్సిపల్ వశిష్ట్ మరియు వైద్య సంస్థ ఫోరెన్సిక్ విభాగానికి చెందిన మరో ప్రొఫెసర్, ఇతరులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఆగస్ట్ 9న ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి గురికావడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును కోల్‌కతా హైకోర్టు సిబిఐకి బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

# రైల్వే ఉద్యోగులపై పని భారం తీవ్రస్థాయిలో సిబ్బంది కొరత

న్యూఢిల్లీ : దేశంలోని రైల్వేలో పెద్ద సంఖ్యలో ఖాళీలు, ప్రాథమిక సౌకర్యాలు లేమి వంటి సవాళ్లను ఎదుర్కొంటోందని రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డిఎస్‌ఒ) తెలిపింది. రైల్వే మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన పనిచేసే ఆర్‌డిఎస్‌ఒ నిర్వహించిన అధ్యయనం ప్రకారం రైలు కంట్రోలర్లు పనిలో తక్కువ వేతన స్కేలు, ఖాళీలు, ప్రాథమిక సౌకర్యాల లేమి కారణంగా తీవ్రమైన ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి అనేక సవాళ్లను ఎదుర్కుంటున్నట్లు పేర్కొంది. ఉద్యోగులపై పని భారం పెరుగుతోందని తెలిపింది. రైల్వే బోర్డుకు సమర్పించిన నివేదికలో సెక్షన్ కంట్రోలర్లు అధిక ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు చేస్తారని, దాదాపు 20 శాతం వరకు ఖాళీలు ఉండటం వల్ల వారి పని మరింత కష్టతరంగా మారిందని తెలిపింది. డిపార్ట్‌మెంట్‌లో పోస్టింగ్ చేసిన అధికారులు డబ్బు, గౌరవం, కెరీర్ వృద్ధి పరంగా తగిన ప్రతిఫలం లేకపోవడం వంటివి ఎదుర్కొంటున్నారు. 'సెక్షన్ కంట్రోలర్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే శీర్షికతో ఈ నివేదిక రైలు కార్యకలాపాల సామర్థ్యం, ప్రభావాన్ని పెంపొందించడానికి ఎంపిక విధానం, శిక్షణ, మౌలిక సదుపాయాలలో మెరుగుదలను అన్వేషించడం లక్ష్యంగా పెట్టుకుంది. దాదాపు 1,05,555 కిలోమీటర్ల ట్రాక్‌లలో ప్రతిరోజూ వేలాది రైళ్లు వివిధ విభాగాల్లో ప్రయాణిస్తున్న ఇండియన్ రైల్వే ప్రపంచంలోని అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటి అని నివేదిక పేర్కొంది. ఐఆర్ నెట్‌వర్క్‌లో 68 ఆపరేషన్ కేంద్రాలతో నియంత్రించబడుతుందని తెలిపింది. డివిజనల్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న డివిజనల్ కంట్రోల్ ఆఫీస్, రైల్వే నెట్‌వర్క్ మొత్తం ఆపరేషన్‌లో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొంది.

# మూడో ప్రపంచ యుద్ధం దిశగా ఉద్రిక్తతలు సాగుతున్నాయి



పశ్చిమాసియా ఉద్రిక్తతలపై అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా అధ్యక్షుడు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. మూడో ప్రపంచ యుద్ధం దిశగా ఉద్రిక్తలు సాగుతున్నాయని హెచ్చరించారు. 'పశ్చిమాసియాలో ఉద్రిక్తలు చల్లార్చేందుకు మా కోసం ఎవరు చర్చలు జరుపుతున్నారు? బాంబులు అన్ని చోట్ల పడుతున్నాయి. కాలిఫోర్నియాలోని బీచ్‌లో స్లీపీ జో నిద్రిస్తున్నారు. డెమొక్రాట్లు బైడెన్ ను దారుణంగా బరిష్కరించారు. కామ్రేడ్ కమలా.. టాంపోన్ టిమ్‌తో కలిసి అమెరికా వ్యాప్తంగా ప్రచారం పేరుతో బస్సు యాత్ర చేస్తోంది. ఉపాధ్యక్ష అభ్యర్థిగా టిమ్ వాల్జ్ చెత్త ఎంపిక. మూడో ప్రపంచ యుద్ధం దిశగా మనం వెళ్తున్నాం. కానీ అది తగదు' అని ట్రంప్ సోషల్ మీడియా ఎక్స్ లో పోస్టు చేశారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్చలు జరపడానికి అమెరికా ఎయిర్ ఫోర్స్ జనరల్ సిక్యూ బ్రౌన్ పశ్చిమాసియాలో పర్యటన ప్రారంభించారు. ఆ తర్వాత ఒక్కరోజుకే ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆదివారం తెల్లవారుజామున దక్షిణ లెబనాన్‌పై వైమానిక దాడులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దీంతో, హెజ్‌బొల్లా వందలసంఖ్యలో రాకెట్లు, డ్రోన్లను ప్రయోగించింది. దీంతో పశ్చిమాసియాలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో, అమెరికా అప్రమత్తమైంది. ఇజ్రాయెల్ కు మద్దతుగా యుద్ధ నౌకలు పంపింది. ఈ దాడుల వల్ల ఇరాన్ సహా ఇతర మిలిటెంట్లు గ్రూపులు కూడా అప్రమత్తమయ్యాయి. వీటిపైనే ట్రంప్ స్పందించారు.



# తేజస్వీకి జీడీపీ అంటే ఏంటో కూడా తెలియదు

న్యూఢిల్లీ : ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నేత తేజస్వీయాదవ్‌పై విమర్శలు గుప్పించారు. బిహార్‌లో 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం ఉన్నప్పటికీ పలు కీలకమైన అభివృద్ధి సూచికల్లో వెనకబడి ఉందని తేజస్వీ చేసిన వ్యాఖ్యలను దుయ్యబట్టారు. "తేజస్వీ కులం, దోపిడీ, మద్యం మాఫియా, నేరాల గురించి మాట్లాడితే ఏమైనా అనడానికి వీలుంటుంది. కానీ వాటికి బదులుగా ఆయన అభివృద్ధి నమూనాల గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తుంది. గత 15 ఏళ్లుగా వాళ్లు అధికారంలో ఉన్నారు. ఆయనకు జీడీపీ అంటే ఏమిటో కూడా తెలియదు. అటువంటివారు బిహార్ అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారు" అంటూ ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. తేజస్వీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్విట్జర్లాండ్‌లా కనిపించిన బిహార్ ఇప్పుడు హీనంగా కనిపిస్తోందా అంటూ ప్రశ్నించారు. నీతీశ్‌కుమార్ తిరిగి మహాఘట్ బంధన్‌లో చేరితే మళ్లీ గొప్పగా కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. కాగా వచ్చే ఏడాది జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 243 స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థులను బరిలోకి దించుతానని ప్రశాంత్ కిశోర్ తాజాగా ప్రకటించారు. ఇటీవల తేజస్వీయాదవ్ బిహార్ అసెంబ్లీలో మాట్లాడుతూ "నిరుద్యోగం, పేదరికం, ద్రవ్యోల్బణం, అవినీతిలో బిహార్ నంబర్ వన్... నేరాల్లోనూ బిహార్ నంబర్ వన్.. రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఉన్నప్పటికీ అభివృద్ధి చేయట్లేదు.. భాజపాకు అధికార దాహం మాత్రమే ఉంది కానీ, ప్రజలతో ఎలాంటి సంబంధం లేదు" అని అన్నారు.

# అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం..

## అక్కడికక్కడే తెలుగు వైద్యుడు మృతి..!



అమెరికాలో కాల్పుల సంస్కృతి కొనసాగుతోంది. నిత్యం ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.తుపాకీ కాల్పుల్లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.తాజాగా శుక్రవారం సాయంత్రం ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ఏపీకి చెందిన డాక్టర్ మృతిచెందిన ఘటన వెలుగులోకొచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు గ్రామానికి చెందిన డాక్టర్ పేరంశెట్టి రమేశ్‌బాబు (64) శుక్రవారం దుండగుడు జరిపిన కాల్పుల్లో మరణించినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు.అమెరికాలోని అలబామా రాష్ట్రంలో వైద్య వృత్తి చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.పలు చోట్ల ఆసుపత్రులు నిర్మించి ఎంతో మందికి ఉపాధి కల్పించాడు . ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఓ వీధికి అతని పేరు పెట్టారని సమాచారం. రమేశ్‌బాబు తిరుపతి ఎస్‌వీ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను పూర్తి చేసిననంతరం పోస్టు గ్రాడ్యూషన్ కోసం విదేశాలకు వెళ్లాడు. జమైకాలో ఎంఎస్ పూర్తి చేసిన తర్వాత అమెరికాలో వైద్యుడిగా స్థిరపడ్డారు. కాగా ఆయన భార్య కూడా వైద్యురాలే. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ బాబు కరోనా సమయంలో చాలా సేవలందించారు. తాను చిన్నప్పుడు చదువుకున్న మేనకూరు పాఠశాలకు గతంలో రూ.14 లక్షల విరాళం ఇచ్చారు. అంతేకాకుండా ఆయన స్వగ్రామం మేనకూరలో సాయిబాబా నిర్మాణానికి రూ.20 లక్షల విరాళం ఇచ్చారు. ఈనెల 15న నాయుడుపేటలో బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొన్న రమేష్ అంతలోనే మృతి చెందారన్న వార్త కుటుంబ సభ్యులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అతని మరణవార్తతో స్వగ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

# మార్క్ జుకర్‌బర్గ్ పై ఎలాన్ మస్క్ సంచలన వాఖ్యలు



అంతర్జాతీయ సోషల్ మీడియా దిగ్గజాలు ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్‌ల మధ్య కొంతకాలంగా సీరియస్ పోరు కొనసాగుతోంది. ముఖ్యంగా ట్విట్టర్ ను కొనుగోలు చేసిన మస్క్ దాని పేరును ఎక్స్ గా మార్చి కొత్త లుక్ ఇస్తుంటే.. దానికి పోటీగా ఫేస్ బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ మెటా థ్రెడ్స్ యాప్ పేరుతో మరో సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ను అందుబాటులోకి తెచ్చాడు. దీంతో ఇరువురి మధ్య పోటీ మరింత ముదిరింది. ఇందులో భాగంగా వరుసగా ఇద్దరి మధ్య మాటలతూటాలు పేలుతూనే ఉన్నాయి. కాగా కొన్ని నెలల క్రితం వీరిద్దరూ కుస్తీ పడటం కోసం కూడా రెడీ అయ్యారు కానీ అనుకోని కారణాల వల్ల వారి కుస్తీ రద్దయింది. ఇదిలా ఉంటె మస్క్ తాజాగా జుకర్‌బర్గ్ పై చేసిన వాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ప్రముఖ ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్ ను అరెస్ట్ చేసినట్టుగానే జుకర్‌బర్గ్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేయాలనీ అన్నారు.టెలిగ్రామ్ మాదిరే ఇన్స్టాగ్రామ్ లో కూడా కంటెంట్ నియంత్రణలో ఉండటం లేదని ఇన్స్టాగ్రామ్ లో పిల్లలు అనేక లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఈ కారణంగానే జుకర్‌బర్గ్‌ను అరెస్టు చేయాలని వెల్లడించారు.దీంతో వీరిద్దరి మధ్య మరోసారి అగ్గిరాజేసుకుంది. దీనిపై జుకర్‌బర్గ్ ఏ విధంగా స్పందిస్తాడో చూడాలి. కాగా టెలిగ్రామ్ లో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, అలాగే కంటెంట్ నియంత్రణ లేకపోవడం వంటి తదితర ఆరోపణలపై ఆ యాప్ వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్‌ను నిన్న ఫ్రాన్స్ రాజధాని పారిస్ లో పోలీసులు అరెస్ట్ చేశారు. ఒకవేల ఈ కేసులో నేరం రుజువైతే పావెల్ దురోవ్‌కు 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉన్నట్టు సమాచారం.

# 'చిత్రపరిశ్రమ'లో ఆరోపణలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు



మలయాళ చిత్రసీమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఏడుగురు పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు కేరళ సిఎం పినరయి విజయన్ ప్రకటించారు. పోలీసు అధికారులతో ఆదివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తాజాగా వస్తోన్న ఫిర్యాదులు, ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఐజి స్పర్జన్ కుమార్ నాయకత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కమిటీలో డిఐజి ఎస్ అజితా బేగం, క్రైమ్ బ్రాంచ్ ఎస్‌పి మెరిన్ జోసెఫ్, జిపి జాలీ, ఐశ్వర్య డోంగ్రే, అజిత్, మధుసూదనన్ ఉన్నారు.

# బంగ్లాదేశ్‌లో కీలక సంస్కరణలు..



సవాళ్లను క్రమంగా పరిష్కరిస్తానని ప్రజలు ఓపిక పట్టాలని బంగ్లాదేశ్ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ కోరారు.వివిధ రంగాల్లో కీలక సంస్కరణల తర్వాత స్వేచ్ఛా యుతమైన, న్యాయమైన ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఆదివారం ఆయన ఓ టెలివిజన్ చానెల్‌లో ప్రసంగించారు. తాత్కాలిక ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయడంతో పాటు, ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి కృషి చేస్తుందని నొక్కి చెప్పారు. బాధ్యతాయుతమైన రాజకీయ వ్యవస్థను ప్రవేశపెట్టడమే తన లక్ష్యమని చెప్పారు. మధ్యంతర ప్రభుత్వ పదవీ కాలానికి ఎలాంటి గడువు ఇవ్వలేదని, కానీ ప్రభుత్వం ఎప్పుడు నిష్క్రమిస్తుందో తెలుసుకోవాలని ప్రతి ఒక్కరూ ఆసక్తిగా ఉన్నారన్నారు. తన ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు స్వాగతించినందున తనకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించడానికి ప్రయత్నిస్తానన్నారు. గత ప్రభుత్వాలు దేశంలోని అన్ని సంస్థలను నాశనం చేశారని విమర్శించారు. సంస్థలపై దాడి చేయడం, నిర్దిష్ట వ్యక్తులను బెదిరించడం, కేసులు స్వీకరించేలా ఒత్తిడి తీసుకురావడం, కోర్టు ఆవరణలో ప్రజలపై దాడులు చేయడం ద్వారా ముందస్తుగా విచారణ జరిపించే ధోరణిని ప్రజలు మానుకోవాలని సూచించారు. అనేక సవాళ్లను రాత్రికి రాత్రే పరిష్కరించలేమని స్పష్టం చేశారు. ఒక క్రమ పద్ధతిలో అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# కఠినమైన శిక్షలు పడేలా చట్టాలు పటిష్టం చేస్తాం



ముంబయి : మహిళలపై నేరాలకు కఠినమైన శిక్షలు విధించేలా చట్టాలను మరింత పటిష్టపరుస్తామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఆదివారం ఉత్తర మహారాష్ట్రలోని జల్గావ్‌లో నిర్వహించిన లఖ్‌పతి దీదీ ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. మహిళల కోసం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి గత ప్రభుత్వాలు చేసిన దానికంటే గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎక్కువ చేసిందని ప్రధాని మోడీ అన్నారు. 2014 వరకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.25,000 కోట్ల కన్నా తక్కువ రుణాలు ఇచ్చారని, అయితే గత పదేళ్లలో తమ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల సహాయం అందించిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ 2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేశారు. ఈ నిధులతో 4.3 లక్షల స్వయం సహాయక సంఘాలలోని 48 లక్షల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. లఖ్‌పతి దీదీ పథకం మహిళలకు ఆదాయాన్ని పెంపొందించడమే కాదు, భవిష్యత్ తరాలకు సాధికారత కల్పిస్తోందని అన్నారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని, దానిలో స్త్రీలది పెద్ద పాత్ర అని అన్నారు. రెండేళ్ల క్రితం పరిస్థితి ఈ విధంగా లేదని అన్నారు.

# సంజయ్ కు పాలిగ్రాఫ్ టెస్ట్

## మరో ముగ్గురికి కూడా..

మాజీ ప్రిన్సిపాల్ ఇంట్లో సిబిఐ సోదాలు కొల్‌కతా : కొల్‌కతాలో ఆర్‌జి కర్ మెడికల్ కళాశాలలో హాలులో 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో ప్రధాన నిందితుడు సంజరు రారుకు, మరో ముగ్గురికి పాలిగ్రాఫ్ టెస్ట్ (అబద్ధాలను తెలుసుకునే పరీక్ష) నిర్వహించారు. ఢిల్లీలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (సిఎఫ్‌ఎస్‌ఎల్) నుంచి కొల్‌కతాకు చేరుకున్న నిపుణుల బృందం ఆదివారం కొల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైలుకు చేరుకుని మొదట ఈ కేసులో ప్రధాన నిందితుడైన సంజరుకు లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించింది. అలాగే ఆర్‌జి కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్‌ఘోష్‌కు మరో ఇద్దరికి కొల్‌కతాలోని సిబిఐ కార్యాలయంలో ఈ పరీక్ష నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో సందీప్ ఘోష్ సహా ఏడుగురికి లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు సిబిఐ కోర్టు అనుమతి కోరింది. విచారణ సమయంలో ఈ పరీక్ష ద్వారా సేకరించిన వివరాలు సాక్ష్యాలుగా కోర్టులు పరిగణించవు. అయినా తదుపరి దర్యాప్తునకు ఈ ఫలితాలు ఉపకరిస్తాయని సిబిఐ అధికారులు భావిస్తున్నారు. ఘటన అనంతరం తానే దారుణానికి ఒడిగట్టినట్టు అంగీకరించిన సంజరురారు పాలిగ్రాఫ్ టెస్ట్‌కు ముందు తాను నిర్దోషినని, తనను ఇందులో ఇరికించారని చెప్పడం గమనార్హం.

# అస్సాంలో మహిళలపై నేరాల వెనుక కుట్ర

గువాహటి: రాష్ట్రంలో ఇటీవల మహిళలపై జరుగుతున్న నేరాల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర ఆరోపణలు చేశారు.నేరాల వెనుక అస్సామీల గుర్తింపును, వారి భూమిని లాక్కొనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజల చేతుల్లోంచి ఆర్థిక అధికారం చేతులు మారుతోందని, దీని వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని వ్యాఖ్యానించారు. "ఏ సమాజం పరిపూర్ణమైంది కాదు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుండడం వాస్తవం.గత మూడు సంవత్సరాల్లో ఈ నేరాలు తగ్గుతూ వచ్చాయి. కానీ, ఇటీవల జరిగిన నేరం (14ఏళ్ల బాలికపై సాముహిక అత్యాచారం ఘటనను ఉద్దేశిస్తూ) అసలు ఉద్దేశం వేరు. బాధితురాలి తల్లిదండ్రులు ఇకపై నాగావ్ జిల్లాలో జీవించడానికి ఇష్టపడట్లేదు" అని ఆయన పేర్కొన్నారు. "మొదటగా ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు గ్రామాల్లోకి ప్రవేశించి నివాసాలను ఏర్పాటు చేసుకుంటారు. మరుసటిరోజు నుంచి వారు గొడ్డుమాంసం తినడం ప్రారంభిస్తారు. దీంతో అసౌకర్యానికి గురైన ప్రజలు అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. ఈ కుట్ర గత 30–35 ఏళ్లుగా సాగుతోంది. అందుకే అస్సామీ ఆందోళనలు జరిగాయి" అని ఆయన పేర్కొన్నారు.

